క్లుప్తంగా

రైతుల దీక్షకు మద్దతు

దిలావర్‌పూర్: ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం నిలపివేయాలని దిలావర్‌పూర్ గ్రామ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గత 16 రోజులుగా కొనసాగుతున్నాయి. ఈ శిబిరాన్ని గురువారం ప్రజాసంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు శిబిరానికి వెళ్లి మద్దతు తెలిపారు. యువకులు, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏఈఈగా ఎంపిక

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శి నినగర్‌కు చెందిన ఎల్.పుష్ప అనే మహిళ మిషన్ భగీరథ ఏఈఈగా ఎంపికైంది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో ఆమె ఉద్యోగానికి ఎంపికైంది. పుష్ప ప్రస్తుతం సోన్ మండలంలో డిప్యూటీ సర్వేయర్ గా విధులు నిర్వర్తిస్తుండగా.. స్థానికులు ఆమెను అభినందించారు.


ఎల్.పుష్ప

క్షీరాభిషేకం

సారంగపూర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ మండలంలోని జామ్ గ్రామంలో గురువారం బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ యువజన సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకులు సుధాకర్, గంగాధర నవీన్ మాట్లాడారు. పెద్దోల్ల నాగయ్య, ఎనుగంటి రాములు, చిన్న లక్ష్మణ్, బొడ్డు రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

గుంతలు పూడ్చిన గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ నుంచి నగర్ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం బాగాపూర్ గ్రామస్తులు గుంతల్లో మొరం నింపి పూడ్చివేయించారు. కార్యక్రమంలో లింగారెడ్డి, కృష్ణారెడ్డి, గంగాధర్, భోజన్న ఉన్నారు.

తపాలాశాఖలో బీమా చేయించుకోండి

ఖానాపూర్: ప్రతి ఒక్కరూ తపాలా బీమా చేయించుకోవాలని పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సందీప్ అన్నారు. గురువారం మండలంలోని సింగాపూర్ గ్రామంలో తపాలాశాఖ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పొదుపు పథకాలు, బీమా పథకాలను వివరించారు. మాజీ సర్పంచ్ రామకృష్ణ, సిబ్బంది కల్యాణ్, సజన్‌సింగ్ తదితరులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడి పూజలు

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కుంకుమార్చన, తీర్థప్రసాదం, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు జరిపించారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వారి వెంట కాంగ్రెస్ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, నల్ల లింగారెడ్డి, రఫీ తదితరులు ఉన్నారు.

అధిక వర్షపాతం నమోదు

లక్ష్మణచాంద: జిల్లాలో బుధవారం రాత్రి వర్షం కురువగా లక్ష్మణచాంద మండలంలో 19.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. నర్సాపూర్ (జి) మండలంలో 15.2 మి.మీ, సారంగాపూర్ మండలంలో 15.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

న్యాయవాదుల నిరసన


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఖానాపూర్: ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రెండోరోజు విధులు బహిష్కరించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. జనగామలో న్యాయవాదులైన దంపతులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నేరెల్ల సత్యనారాయణ, న్యాయవాదులు వెంకట్ మహేంద్ర, బక్కశెట్టి కిశోర్, కిశోర్‌నాయక్, ఖాజా, బాశెట్టి శివ, ఆసిఫ్ అలీ, షబ్బీర్‌పాషా, పరమేశ్వర్, సలీం ఖాన్, వేణు తదితరులున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

భైంసాటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని భైంసా ఫారెస్ట్ రేంజ్ ఇన్‌చార్జి అధికారి ఎస్.శంకర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రేష్మ, సెక్షన్ ఆఫీసర్లు లక్ష్మణ్, కీర్తి, బీట్ అధికారులు లెనిన్, ముస్తాక్, మహేశ్, రాజేశ్, సిబ్బంది గంగాధర్, దీక్షిత్ ఉన్నారు.

ముధోల్: మండలకేంద్రంలోని ఏరువాక కేంద్రంలో గురువారం శాస్త్రవేత్తలు మొక్కలు నాటారు. డాక్టర్ కె.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పేర్కొన్నారు. డా.కార్తీక్, తదితరులున్నారు.

కళాశాలలో సౌకర్యాలేవి?

- తానూరులో తొమ్మిదేళ్ల కిందట ఏర్పాటు
- నిధులు మంజూరైనా.. ప్రారంభం కాని భవన నిర్మాణం
- ఇంటర్ విద్యార్థులకు సరిపోని తరగతి గదులు
- ప్రయోగశాల, నీటివసతి లేక ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు


తానూరులో ఇరుకు గదిలో పాఠాలు వింటున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు


నీటి సౌకర్యం లేని మరుగుదొడ్లు

తానూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సౌకర్యాల్లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అధ్యాపకుల కృషితో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తుండటంతో ప్రవేశాల సంఖ్య ఏటా పెరుగుతోంది. కానీ కళాశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. సొంత భవనం లేక శిథిలావస్థకు చేరిన పాత భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. అక్కడా మరుగుదొడ్లు ఉన్నా.. నీటి వసతి లేదు. దీంతో ఒంటికి, రెంటికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ప్రయోగశాల, ఫర్నీచర్ లేదు. ఏడేళ్ల కిందట కళాశాలకు సొంత భవనం నిర్మించేందుకు రూ.1.20 కోట్లు మంజూరు చేశారు. కానీ పంచాయతీ అధికారులు స్థలం కేటాయించడంలో ఆలస్యం చేయడంతో నిధులు వెనక్కి వెళ్లినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

నాడు 27 మంది.. నేడు 200 మంది

2014లో ప్రభుత్వం తానూరులో జూనియర్ కళాశాల ఏర్పాటుకు అనుమతిచ్చింది. 2014-15లో ఉర్దూ మీడియం పాఠశాల భవనంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను 27 మంది విద్యార్థులతో ప్రారంభించారు. తర్వాత ఏడాదికే 2015-16లో ఖాళీగా ఉంటున్న బీసీ వసతిగృహ పాత భవనంలోకి మార్చారు. ప్రస్తుతం కళాశాలలోని ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సుల్లో సుమారు 200 మంది వరకు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. కళాశాల ప్రారంభంలో 27 మంది ఉండగా ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 200కు చేరింది.

ఏడు సంవత్సరాల కిందట తానూరులో జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరయ్యాయి. కానీ పంచాయతీ అధికారులు స్థలం కేటాయించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లినట్లు పలువురు పేర్కొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ఫలితాలు..

2014-15లో జులై 14న 27 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభించారు. 2017-18లో 90 శాతం, 2018-19లో 90 శాతం 2020-21లో వంద శాతం 2021-22లో వందశాతం, 2023-24లో 85 శాతం ఫలితాలు సాధించారు. ఏటా ఉత్తీర్ణత శాతం పెరగడంతో సమీప గ్రామాల విద్యార్థులు కళాశాలలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

కరువైన సౌకర్యాలు..

ప్రస్తుతం భవనంలో ఉన్న మూడు ఇరుకు గదుల్లోనే అధ్యాపకులు పాఠాలు బోధిస్తున్నారు. ప్రయోగశాల, తగిన ఫర్నీచర్ లేకపోవడంతో పలు పాఠాలు అర్థం కావడం లేదని బైపీసీ, మ్యాథ్స్ విద్యార్థులు వాపోతున్నారు. మరుగుదొడ్లు ఉన్నా.. నీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఒంటికి, రెంటికీ వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. వాచ్‌మెన్ లేకపోవడంతో పలువురు మందుబాబులు రాత్రి కళాశాల ఆవరణలోనే మందు తాగుతున్నారు. నూతన భవనం నిర్మించాలని విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇరుకు గదుల్లో తరగతులు



కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో ఇరుకు గదుల్లో పాఠాలు బోధిస్తున్నారు. తగినంత ఫర్నీచర్, ప్రయోగశాల లేకపోవడంతో పాఠాలు అర్థం కావడం లేదు. అధికారులు స్పందించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరించాలి.

– ఆకాశ్, ఇంటర్ ప్రథమ సంవత్సరం, బమ్మెర

నీటి సౌకర్యం కల్పించాలి



కళాశాలలో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందులో కొన్ని బాగున్నా.. నీటి వసతి లేకపోవడంతో ఒంటికి, రెంటికీ వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. మరుగుదొడ్లకు నీటిసౌకర్యం కల్పించాలి.

– చంద్రకళ, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, ఉమ్రి(కే)

ఉన్నతాధికారుల దృష్టికి..

తానూరు జూనియర్ కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరైన మాట వాస్తవమే. భవన నిర్మాణ కోసం గ్రామపంచాయతీ నుంచి ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంలో ఆలస్యం కావడంతో నిధులు వెనక్కి వెళ్లినట్లు మా దృష్టిలో ఉంది. భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చూస్తాం.

– జాదవ్ పరశురాం, డీఐఈవో

సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోండి

- జెడ్పీ సీఈవో గోవింద్
- కొనసాగుతున్న స్వచ్ఛదనం–పచ్చదనం

సోన్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచుకోవడంతోపాటు పరిసరాల్లో మురుగునీరు నిల్వకుండా చూసుకోవాలని జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి గోవింద్ సూచించారు. గంజాల్, కడ్తాల్ గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గంజాల్ ముత్యలమ్మ ఆలయ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కడ్తాల్‌లో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. వారంలో రెండు రోజులు డ్రైడే నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్, ఎంపీవో ఖలీల్ హైమద్, ఎంపీవో మంజుల, ఐకేపీ ఎంపీవో గంగామణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, కార్యదర్శి రాణి, తస్కీన్ సుమయ్యద్, టీఏ కృష్ణ, వీవోఏలు, ఆశవర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

లోకేశ్వరం: జ్వరం లక్షణాలుంటే ఆసుపత్రికి వెళ్లాలని లోకేశ్వరం పీహెచ్‌సీ వైద్యురాలు తేజస్విని అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు ధర్మోర, పంచగుడి తదితర గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఎంపీడీవో సోలమాన్ రాజ్, ఏపీవో మల్లేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీనా ఉన్నారు.

తానూరు: విద్యార్థులు తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా గురువారం మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, శంకర్, సుదర్శన్, సుజాతదేవి, లక్ష్మి, రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఎఫ్ఏ నరేశ్ ఉన్నారు.


సోన్ మండలం గంజాల్‌లో మొక్క నాటుతున్న జెడ్పీ సీఈఓ గోవింద్, అధికారులు

లక్ష్మణచాంద: గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి.. జ్వరపీడితులకు వైద్యం అందించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైనార్టీ అధికారి మోహన్ సింగ్ పేర్కొన్నారు. గురువారం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మండల కేంద్రంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాచాపూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన డ్రైడేలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధ, ఎంపీఓ అమీర్‌ఖాన్, వైద్యురాలు ప్రత్యూష, పంచాయతీ కార్యదర్శి విక్రమ్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్, షేక్ నవాబ్‌పేట్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, కౌన్సిలర్లు అబ్రార్, ముజాహిద్, తౌహిద్ రప్పు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఖానాపూర్: పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని పాతతర్లపాడ్, కొత్తపేట, బావాపూర్(కె) గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు.


లక్ష్మణచాందలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది


భైంసాటౌన్ : ర్యాలీ తీస్తున్న వైద్య, మున్సిపల్ ఉద్యోగులు

ఈసందర్భంగా ఫీవర్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

బాసర: మండల కేంద్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ ప్రధాన రోడ్డు నుంచి గోదావరి నదికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి గోవిందరాజు ట్రాక్టర్ సాయంతో ముళ్లపొదలు తొలగింపజేశారు. అనంతరం మురుగు కాల్వలను శుభ్రపరిచారు.

భైంసాటౌన్: ఇళ్లు, పరిసరాల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలని మెడికల్, హెల్త్ విభాగం సబ్ యూనిట్ అధికారి కలీమొద్దీన్ అన్నారు. పట్టణంలో డెంగీ, మలేరియా, చికున్ గున్యా వ్యాధులపై అవగాహన ర్యాలీ తీశారు. జ్వరం లక్షణాలుంటే ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ కమలేశ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అనర్హులను తొలగించాకే అర్హులకు ఇళ్ల పట్టాలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: డబుల్ బెడ్‌రూం ఇళ్లు పొందిన అనర్హులను తొలగించాకే అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలోని కాలనీలో అమృత్-2 స్కీం కింద రూ.22.50 కోట్లతో నిర్మించే వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను అనర్హులకు కేటాయించి అర్హులకు అన్యాయం చేసిందన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

అనర్హులను తొలగించేలా అధికారులతో విచారణ జరిపిస్తామన్నారు. అమృత్-2 పథకం ద్వారా పట్టణ వాసులకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డబుల్ బెడ్‌రూం కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా ఇళ్లు రాని పలువురు బాధితులు అక్కడికి చేరుకుని తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం స్థానిక బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోండి'

సారంగపూర్: మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కృష్ణవేణి పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీగౌడ్ అన్నారు. గురువారం ఆయన పాఠశాలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. వారి వెంట బీసీ సంఘం నాయకులు ఉన్నారు.

టై, బెల్ట్‌ల పంపిణీ

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు రూ.5వేల విలువైన టై, బెల్టులు పంపిణీ చేశారు. తన మనుమడు విహాన్ జన్మదినం పురస్కరించుకుని టై,బెల్టులను అందించినట్లు పాఠశాల ఉపాధ్యాయుడు డి.శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఊర్మిళ, ఉపాధ్యాయులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

భైంసాటౌన్: విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మిషన్ శక్తి సభ్యులు జ్యోతి, మౌనిక అన్నారు. గురువారం పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా, శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో వందరోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికా సాధికారత, బాల్యవివాహాలు, లింగ వివక్ష-సమానత్వం, పోక్సో చట్టం గురించి వివరించారు. మహిళలకు ఇబ్బందులుంటే హెల్ప్‌లైన్ నంబర్ 1098ను సంప్రదించాలని సూచించారు. హెచ్ఎం స్వర్ణ మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.


మాట్లాడుతున్న మిషన్‌శక్తి సభ్యులు

పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

తానూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావ్ అన్నారు. గురువారం మండలంలోని బెల్‌తరోడా, భోసి, తానూరు, బోరిగాం, భోసి పాఠశాలతోపాటు కేజీబీవీలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దుతోపాటు వచ్చే నెల ఐదో తేదీలోగా కొత్త ఉపాధ్యాయుల నియమకాలు జరిపించి బదిలీ అయిన వారిని రిలీవ్ చేసేలా చూస్తామని పేర్కొన్నారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్ సందే, నర్సింలు, సుధాకర్, పదరి, వందన, శంకర్, లతీఫ్,మల్లన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమణారావ్

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ

కడెం: కేరళలోని వయనాడ్ వరద బాధితులకు సాయం అందించేందుకు మండల కేంద్రంలో సీపీఎం నాయకులు గురువారం విరాళాలు సేకరించారు. వరదలతో వయనాడు వాసులు సర్వం కోల్పోయారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్ తెలిపారు. ఇందులో నాయకులు సురేశ్, తిరుపతి, శంభు, పోశలింగం తదితరులు పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

'నాసిరకం బియ్యం పంపిణీ'

నర్సాపూర్ (జి): మండలంలోని చాక్‌పల్లిలో నాసిరకం పీడీఎస్ బియ్యం సరఫరా చేస్తున్నారని సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం తెలిపారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమమైనా 'ఎక్స్'లో పోస్ట్ చేసి.. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్, తెలంగాణ సీఎంఓలను ట్యాగ్ చేశారు. ఇటీవల డీఎస్ఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. అధికారులు స్పందించి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని కోరారు.

ర్యాపిడ్ ఫీవర్ సర్వే

లక్ష్మణచాంద: మండలంలోని 11 గ్రామాల్లో గురువారం వైద్యసిబ్బంది ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. లక్ష్మణచాంద పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూష ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. జ్వరపీడితుల రక్తనమూనాలు సేకరించి మందులు అందించారు. చామన్‌పెల్లిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 100 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీమంత్, అధికారులు హరికుమార్‌గౌడ్, మతిన్, సిబ్బంది శివకృష్ణగౌడ్, ఉమాదేవి, ఆశా కార్యకర్తలు ఇంద్రజ, పోసవ్వ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

కుంటాల: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వనమహోత్సవంలో భాగంగా లక్ష్యం మేర మొక్కలు నాటించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏపీవో గట్టుపల్లి నవీన్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటరుణాలు మాఫీ చేయాలి

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి పీఏసీ ఎస్‌లోని పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. సత్తనపల్లి పీఏసీ ఎస్‌లో 236 మంది రైతులకు రుణం మాఫీ కాలేదన్నారు. సమావేశంలో అల్లెపు పీటర్, భూక్య సురేందర్, తిరుపతి, నారాయణ, రాజన్న, రాజేందర్ ఉన్నారు.

ఓపెన్ విద్యలో ప్రవేశాలు

లక్ష్మణచాంద: ఓపెన్ విద్యలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రాజు నాయక్, అసిస్టెంట్ కోర్డినేటర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓపెన్‌లో పదోతరగతి, ఇంటర్ చదివేందుకు అపరాధ రుసుం లేకుండా వచ్చే నెల 10 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఆసక్తి కల్గినవారు 94940 26421, 98496 87123 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కోతులు, కుక్కల బెడద నిర్మూలించండి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో వీధికుక్కలు, కోతుల బెడదను నిర్మూలించాలని గురువారం కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. చిన్నపాటి వర్షానికే కాలనీలోని రోడ్లు గుంతలమయంగా ఏర్పడి ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. కాలనీ అధ్యక్షుడు బొద్దుల భానుచందర్, సాయినాథ్, భూమేశ్, శ్రీను, సాగర్‌వర్మ తదితరులు ఉన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

లక్ష్మణచాంద: రైతులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో రుణమేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట రుణాలతోపాటు వ్యవసాయ భూములపై గరిష్ఠగా రూ.15 లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. బ్యాంకు అధికారులు గీత, రామ మహేశ్వరరెడ్డి, సంతోష్, సాయి ప్రశాంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

ముధోల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బిద్రెల్లిలో రైతులకు ఎరువులు, విత్తనాలు ఉన్నాయని చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. డీఏపీ బస్తా రూ.1350, 20:20:20:0:13 రూ.1100, యూరియా రూ.267, 12:32:16 రూ.1470, 15:15:15 రూ.1380 ఉందని.. అవసరమైన రైతులు ఆధార్‌తో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని చైర్మన్ రత్నాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో కార్యాలయానికి రావాలని సూచించారు.

ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలి

నర్సాపూర్(జి): ఎస్సీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల వేళ చేవెళ్ల డిక్లరేషన్‌లో అంబేద్కర్ అభయ హస్తం కింద ప్రతి కుటుంబానికి రూ.12 లక్షల సాయం, శాశ్వత ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం, ఎస్సీ కార్పొరేషన్ కు రూ.1000 కోట్ల నిధులు కేటాయిస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా ఒక్క హామీ నెరవేర్చడం లేదని పేర్కొన్నారు. దళిత మోర్చా మండల అధ్యక్షుడు బర్కుంట అశోక్, దూసముడి సవీన్, బర్కుంట లక్ష్మణ్, పర్స మహేశ్, బొల్లి గంగారాం, శివకుమార్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూమి కొని మోసపోవద్దు'

భైంసాటౌన్: మండలంలోని హంపోలి గ్రామంలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన సర్వేనంబర్ 16/ఆలో ప్రభుత్వ భూమిని కొని మోసపోవద్దని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు కోరారు. గురువారం ఆయన భైంసాలో మాట్లాడుతూ 1983లో హంపోలిలోని ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం కేటాయించిన భూమిని ఓ వ్యక్తి అక్రమంగా పట్టా చేసుకున్నాడని.. సదరు భూమిని విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎల్‌డబ్ల్యూఎస్‌గా రెవెన్యూ రికార్డుల్లో ఉందని.. వెంటనే పట్టా రద్దు చేయాలని అధికారులను కోరినట్లు పేర్కొన్నారు. కోర్టులో కేసు ఉందని, సదరు భూమిని ఎవరూ కొనవద్దని సూచించారు. గ్రామస్తులు దీనాజీ, ఎల్లప్ప, విఠల్, సురేశ్, గంగారాం, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఎం.హరిత, ఏఐకేఎంఎస్ నాయకులు గంగాధర్ పాల్గొన్నారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం గోపూజ, బాబాకు అభిషేకం, అలంకరణ, అర్చన నిర్వహించారు. హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. చేశారు.